అదృష్టవంతులు

శ్రీ నండూరు సుబ్బారావు

సలక్షణంగా గోపాలం పెళ్ళి ముగిసింది. నేను, ప్రసాదు తిరుగు ప్రయాణానికి బెడ్డింగు బిగించే లోపల గోపాలంవచ్చి మా ప్రయాణం వాయిదా వేశాడు. అది పల్లెటూరు అవటంచేత సాయంకాలం పొలాలకేసి షికారు వెళ్ళాం. పొలిమేర గట్టుమీద కూర్చుని పెళ్ళి సంగతులు మాట్లాడుకొంటున్నాము. హఠాత్తుగా మాట్లాడం ఆగి గోపాలం 'నా పెళ్ళి విషయం చూస్తూవుండే నాకే ఆశ్చర్యం వేస్తోంది' అన్నాడు. అసలు విషయం మాకు తెలియదుగా అంచేత వాడే మొదలు పెట్టాడు "పూర్వం సీతను నేను ప్రేమించాను. ప్రతిరోజు స్కూలుకు కలసి వెళ్ళేవాళ్ళం. కాలేజీలో మొదటి సంవత్సరంకూడ యిట్లాగే జరిగింది. కాని ఖర్మ వశాత్తు వాళ్ల నాన్నను మా వూరినుండి బదిలీ చేయటంవల్ల ఆమె దూరమయింది. ఆ రోజు నేను వూళ్ళోలేను. ఉంటే అడ్రస్సు ఇచ్చేదే. నాకు బి. ఏ. అయిపోవటంతో పెళ్లి సంబంధాలు మీద సంబంధాలు చూశాను. కాని మనస్సంతా ఆమె మీదే వుండేది. చివరికి మా నాన్నతో నీకు బాగున్న పిల్లనే చేసేయి అంటే నాలుగు రోజులలో మా నాన్న స్నేహితుని ద్వారా యీ వూరి పిల్లను చూచి ముహూర్తం పెట్టించాడు. సరే...... తీరా పెళ్లి పీటలమీద కూర్చున్న తర్వాత చూసేటప్పటికి ఒక్కసారి యెగిరి గంతేద్దామనిపించింది. (పీట్ని చూసే టప్పటికి మాకు నవ్వు వచ్చింది) ఎందుకంటారేమో...... "పూర్వం నా ప్రియురాలేరా యీమె" అన్నాడు. అమాంతంగా కావిలించుకొని అదృష్ట వంతుడివిరా అన్నా నేను. "ఒరేయ్ గోపాలం! నీ కంటే వీడే గొప్పవాడురోయ్. నాకు వాడు పెళ్ళి సంగతి రైల్లో సగం చెప్పాడు!" అని నా వైపు తిరిగాడు ప్రసాదు. గోపాలానికి కోపం వచ్చింది నా సంగతి చెప్పలేదని. ఇకేం...... మళ్లీ మొదలుపెట్టానా పెళ్ళిగాధ......

"అది ఎండా కాలం. ఎండలు విపరీతంగా కాస్తూన్నాయి. నేను, ప్రసాదు, ఆంజనేయులు మా యింటి ఎదురుగా వుండే మఱ్ఱి చెట్టు క్రింద కూర్చుని పేపరుకోసం ఎదురు చూస్తూ వున్నాము. ఆ రోజే మా S. S. L. C. పరీక్షా ఫలితాలు పడే రోజు. ఇంతలోకే పేపరు వచ్చింది కానీ అసలు మా స్కూలు మొత్తం పేర్లు పడలా. మా ఫలితాలు ఆపు చేయబడ్డాయని క్రింద వ్రాసి వుంది. ఇక నిరాశహృదయంతో ప్రతిరోజు పేపరు చూడ్డం ఇంకా ఫలితాలు పడకపోటం జరుగుతూవుంది. దాదాపు నెల రోజులు జరిగింది యీ విధంగా. కాలేజీలు అన్నిచోట్ల తెరిచారు. ప్యాసయిన వాళ్ళు సంతోషంతో కళాశాలలలో చేరటానికి వెళుతున్నారు. బహుశా! ఆ రోజు మాకు పర్వదినం లాగుంది! పోష్టాఫీసుకు పెద్ద పార్సిల్ వచ్చింది. మెల్లిగా బంట్రోతు హెడ్మాష్టరుకిచ్చాడు. ప్యాసయినవాళ్ళ పేర్లు చదివాడు. మొత్తంమీద మనం మంచి మార్కులతో ప్యాసయినాను.

గబ గబా మూట ముల్లే సర్దుకొని బెజవాడలో యిల్లు అద్దెకు తీసుని కాలేజీలో చేరా. పాఠాలవి జరగడంలేదు. ఈ విధంగా పదిహేను రోజులు గడిచాయి...... మా యింటి ఎదురుగాడాబాయింట్లో ఒక అమ్మాయి వుండేది. ఒక రోజున హఠాత్తుగా ఆ అమ్మాయి కళ్లు నా కళ్ళు కలుసుకున్నాయి. అదే మా యిద్దరి ప్రేమకు నాంది అనుకుంటా. రోజు రోజుకు వృద్ధి అవుతోంది మా పరస్పర ప్రేమ. మధురమైన రాత్రింబవళ్లు రెండు నెలలు జరిగాయి. ఆ అమ్మాయి

పేరు శారద. ఇప్పుడు నన్ను చూచి శారద, శారదను చూసి నేను నవ్వుకోటం జరుగుతూవుంది.

ఆ రోజు గురువారం మధ్యాహ్నం నుంచి నాకు కాలేజిలేదు. పెందలకడే యింటికి వచ్చా. శారదా వాళ్ళ యింటికేసి చూశా. ఏదో లేసు అల్లుకోంటోంది. చిన్న దగ్గ దగ్గేటప్పటికి తలయెత్తి చూసి చిరునవ్వు నవ్వింది. మెల్లగా లోపల పుస్తకాలు పడేసి బయటికివచ్చి నుంచున్నా. ఎన్నిరోజులనుంచి కనిపెడుతోందో మా అమ్మ యింక వుండ బట్టలేక "అబ్బాయీ! నువ్వు ఆ అమ్మాయివంక, ఆ అమ్మాయి నీ వంక చూసి నవ్వుకుంటున్నారు. ఆ అమ్మాయి పెళ్ళికాని పిల్ల. అమ్మాయివంక చూడటం చాల తప్పు. మనం గౌరవంగా బ్రతుకుతున్నాం. వాళ్ళ వాళ్ళు గొప్పవాళ్ళు. తెల్లవారి లేస్తే ఒకరి ముఖాలు వొకరు చూచుకొని తిరగాలి. ఎదయినా మాట వచ్చిందంటే కష్టం. జాగ్రత్త! యింక నీయిష్టం తరువాత యేం అనుకున్నా లాభంలేదు" అనేటప్పటికి గోరుచుట్టుపై రోకలిపోటు పడ్డట్లయింది మనకు - కాని అమ్మ పలుకులు అమర సందేశాలుగా కన్పించాయి. వెంటనే ఆ అమ్మాయి వంక చూడకూడదు అనుకున్నా. ఏమయితేనేం రెండు రోజులు ఆ వైపు తలయెత్తి చూడలా. కాని మనస్సు మాత్రం విపరీతంగా ఆ వైపుకు లాగుతోంది. కాని ప్రేమ వైపే మొగ్గు చూపింది మనస్సు. అమ్మ చూడకుండా శారద వంక చూస్తూ నవ్వుతూ ఆనందించే వాడిని. ఈ విధంగా ఆరు నెలలు ఆనంద డోలికలలో మునుగుతూ తేలుతూ గడిచాయి, 'కాని భగవంతుడికి కూడ మా ప్రేమంటే అనూయ కల్గింది.' ఒక రోజున మా యింటి యజమాని హఠాత్తుగా చనిపోయాడు. ఆ రోజు మంచిది కాదు. అంచేత యిల్లు ఖాళీ చేయవలసి వచ్చింది. ఎంత కష్టం వచ్చిందిరా అనుకుంటూ కాలేజీకి వెళ్ళా. సాయంకాలానికి యింటికివచ్చేసరికి యిల్లంతా ఖాళీ అయింది. ఒక్కసారి శారదయింటికేసి చూశా. గుమ్మంలో నిలబడివుంది. అకస్మాత్తుగా కళ్ళంబడి నీళ్లు తిరిగాయి. ఎలాగో తమాయించుకొని చిరునవ్వు నవ్వా! సమాధానం విచారకమైన చిరునవ్వు.

కొత్త యింట్లో చాలా హుషారుగా వుంది. తరచుగా శారద యింటికేసి వెడుతూ వుండేవాడిని. సంక్రాంతి శెలవలిచ్చారు కాలేజీకి. ఆ రోజు భోగి. శారద పట్టుచీర కట్టింది-చక్కని వాలుజడవేసి ముని గోరింట పూలచెండు తల్లో సింగారించింది. చెవులకు బుట్ట లోలాకు లున్నాయి. అప్పుడే వాళ్ళ యింటి మీదుగా వెడుతున్నా. గుమ్మాలకు కుంకం బొట్లు పెడుతోంది. ఒకసారి అలా ... చూశా. ఆనందానికి అంతులేదు. ఒక్కసారి పలుకరిద్దామా అనిపించింది. కాని అప్పటికా భాగ్యం నోచుకోలేదనుకున్నా మనస్సులో. ఇంతలోకే యిటువైపు తిరిగి చిలిపిగా నవ్వింది. కొంపదీసి నా భావం అర్థం చేసుకుందా అని నవ్వుకుంటూ వెళ్ళిపోయా. రెండేళ్ళ కాలచక్రం గిఱ్ఱున తిరిగింది. పేపరులో నా నంబరు ప్రధమ శ్రేణి అలంకరించింది. ఇంక నా సంతోషం కట్టలు తెగి మైదానం మీదుగా ప్రవహిస్తోంది. హఠాత్తుగా శారద జ్ఞాపకం వచ్చింది. శుభవార్త యింట్లో చెప్పి శారద యింటివైపు దారి తీశా. నేను వస్తూవున్నానని తెలుసుకుందో యేమో స్వాగతం యివ్వటానికి నిల్చుంది. మధ్యాహ్నంవేళ బజారులో నరమానవుడులేడు. నేను తలయెత్తి చూశా కాని నవ్వకుండా నడుస్తున్నా. వాళ్ల గుమ్మం వరకువచ్చా. ఇంతవరకు నాకు శారదకు మధ్య ఏలాటి మాటలు జరగలా. హఠాత్తుగా 'ఏమండీ! మా అన్నయ్య కనుపించాడా?' అంది శారద. తబ్బిబయి వెంటనే తమాయించుకొని 'ఆ ... కనుపించాడు. బికాం ప్యాసు అయ్యాడు.' అన్నా నవ్వుతూ. 'మరి... మీరు?' అంది. 'ఆ ఫస్టుక్లాసులో ప్యాసు అయ్యా' అని ఆమెకేసి చూచా. సంతోషంతో తల వాల్చింది. వీధికేసి అటుయిటు చూసి "ఇంకా చదువుతారా?... ... అయినా మరొక వూరు వెడతారు లాగుంది." అంది నవ్వుతూ. 'బహుశా మద్రాసులో ఎలక్ట్రిక్ యింజనీరు కాలేజిలో చదవాలని వుంది. అక్కడకు వెడతాను' అన్నా. శారద ముఖంలో కొంచెం విషాద రేఖలు కన్పించాయి. కాని మరుక్షణంలో మంచి చదువుకు వెళ్లబోతున్నానని సంతో

షంతో ముఖం వికసించింది. ఇంతలోకే వాళ్ల అమ్మ వచ్చింది. నన్నుచూసి 'ఏమండీ ప్యాసు అయినారా' అంది. ''ఆ'' అని సమాధానం చెప్పా. ఇంతకీ మాకు జరిగిన సంభాషణ వినలా ఆవిడ. వింటే ఏమయ్యేదో! బహుశా వింటే కూతుర్ని పరాయి వాడితో మాట్లాడుతున్నందుకు కేక వేసేదేమో? 'వెడతానండి' అని చెప్పి శారదముఖం కేసి చూశా. చిరునవ్వుతో వికసించింది ముఖం. ఆనంద డోలికల్లో తేలిపోతూ యింటి దారి పట్టా.

ఆ రోజు మద్రాసు చదువుకోసం బయలుదేర బోతున్నా. సాయంకాలం బండికి వెడదామని పెట్టె, బెడ్డింగు సర్దుకున్నా. నిజం చెప్పాలంటే, ఆ రోజు కొంచెం విచారంగానే గడిచింది-శారదకు దూరమవుతున్నానని. వెళ్లేముందు శారదను చూడాలని బుద్ధి పుట్టింది. 5½ గంటకి వాళ్ళ యింటివేపు వెళ్ళా. ఏదో పనిమీద బయటకువచ్చి నన్నుచూసి ఆగిపోయింది. 'ఇంకో గంటకి మద్రాసు బయలుదేర బోతున్నా' అన్నా. సమాధానం లేదు. కొంతసేపాగి...... 'శలవల్లో వస్తూ వుంటారా? లేకపోతే ఇక్కడిదంతా మర్చిపోయి అక్కడే వుంటారా?' అని తలవంచి అడిగింది. ''ఇక్కడిదంతా అంటే'' కొంటెగా ప్రశ్నించా (కొద్దిగా తబ్బిబ్బై) ఆ...... 'మీకు అలవాటయిన యీ రోడ్డు — మీ స్నేహితులు, మీ శరీరంకోసం ఎదురు చూసే కళ్ళు, ఇంకా' అంటూ వుండగానే గబాలునా ఆమె చేతిని నా చేతుల్లోకి తీసికున్నాను ఎవరయినా చూశారేమోనని యిద్దరం కలవరపడ్డాం కాని అలాంటిదేమి జరగలా. 'ఏమిటిది - నడిబజార్లో' అంది శారద. 'ఈ దీనుడు ఎక్కడున్నా నిన్ను మర్చిపోడన్నా' నవ్వుతూ. 'అమ్మ వస్తుందేమో నేను వెడతా' నంది. 'నేను వెడతా. శెలవల్లో తప్పకుండా వస్తా'నని చెప్పి యింటికి వచ్చా.

త్యాగరాయ నగర్‌లో ఒక యిల్లు అద్దెకు తీసుకున్నా. చదువు జోరుగా సాగుతోంది. శెలవలిచ్చారు కాని బెజవాడ వెళ్ళలేదు. శారదకోసం వెడదామనుకొన్నా కాని చదువుమీద వుత్సాహం యెక్కువయింది. నాలుగు సంవత్సరాల కాలచక్రం గిఱ్ఱున తిరిగింది. పరీక్ష లయిపోయాయి. యూనివర్సిటీ ఫస్టు వస్తుందనే ధీమాగావుంది. స్నేహితులు కూడా అదేముక్క అన్నారు. ఇంటికి వద్దామని బయలుదేరా. ఇంతలోకే పంకజ నయన వచ్చి 'ఏమండీ, నేనుకూడా రాత్రి ట్రయినుకే బయలుదేరుతున్నా. మీరు బెజవాడ. నేను ఏలూరు. ట్రయిను జర్నీ హాయిగా వుండవచ్చు ఏమంటారు?' అంది. 'మీకు నా సంగతెవరు చెప్పారు' అన్నా నవ్వుతూ 'వనజ చెప్పింది' అన్నాది. నేనంటే కాలేజీలో నలుగురు ఆడవాళ్ళకు తగని వాత్సల్యము. ఎంచేతంటే ఆడవాళ్ళయొక్క పురోభివృద్ధిని గురించి, వరకట్న నిర్మూలలని గురించి, చదువును గురించి చర్చలు వ్యాసాలు మొదలయినవి వ్రాసేవాణ్ని. ఆరోజు రాత్రి రైలు జర్నీ చాలా హుషారుగా జరిగింది. మర్నాడు 8 గంటలకు బెజవాడ చేరింది. పంకజ నయన దగ్గర శెలవు పుచ్చుకొని యింటికి బయలుదేరా.

ఇంటికి రాగానే రెండు రోజులలో రెండుమూడు పెళ్ళిసంబంధాలు వచ్చాయి. కాని నాకేమి నచ్చలా. మనస్సంతా శారదమీద లగ్నమవుతే. మరునాడు వుత్సాహంగా వాళ్ళ యింటికెళ్ళా. శారదావాళ్ళ అమ్మ చాలా గౌరవంగా మాట్లాడింది. చాలాసేపు అనేక కబుర్లమీద శారద పెళ్లి ప్రస్తావనయెత్తి కట్నాల గొడవంతా చెప్పి 'మీ స్నేహితులెవరయినా వుంటే కాస్త చెప్పండి! పెళ్ళి చేసేయాలని వుంది' అంది. '......అన్నట్టు నా స్నేహితుడున్నాడు. చాలా బాగుంటాడు. నాతోపాటే చదివాడు. మీ అమ్మాయి చేసుకోవచ్చు బహుశా. నేను తప్పకుండా వొప్పిస్తాను లెండి. కట్నంకూడా తీసుకోడు. పిల్ల మాత్రం బాగుండాలన్నాడు వాడితో ఒకసారి ఏ సంగతి కనుక్కొని చెబుతానులెండి' అన్నా సంతోషంతో 'అలాగే లెండి' అందామె, కాని గోడ ప్రక్క నిల్చున్న శారద ముఖంలో విచారం కోపం వచ్చాయి.

నా మాటలకు నమ్మించి మోసం చేశాననుకుంది. శారదకేసి ఒక కన్ను వేసి అంతా కనిపెట్టా. 'వెడతానండి' అని చెప్పి యింటికివచ్చా. అమ్మా నాన్నతో పెళ్ళిసంగతంతా చెప్పి ఆ అమ్మాయినితప్ప యింకోళ్లని చేసుకోనని చెప్పా. మా నాన్న మొదట ఏదో అన్నా తరువాత సరే అన్నారు. మంచి రోజున ముహూర్తం నిశ్చయించారు. నెల రోజులలో దిగ్విజయంగా పెళ్లి ముగిసింది...... ఎందుకొచ్చిన ప్రేమ పెళ్లి గాధ అని నీతో చెప్పలా. సరే కాలక్షేపానికి రైల్లో ప్రసాదుతో సగం చెప్పా. సరే...... ఇంక నీ పెళ్లి గాధ విన్న తర్వాత నా వింతగాధకూడా వివరించా. ఇదీ నా ఆరు ఏళ్లు ప్రేమ కలాపాలు జరిగిం తరువాత జరిగిన వింత ప్రణయ పెళ్లి గాధ." అంటూ ముగించా. 'నీదానికంటే వీడి కథే బాగుందిరా' అని ప్రసాదు నా వైపు తిరిగాడు. ఇంతకీ... 'యిద్దరూ అదృష్టవంతులురా' సుఖ జీవితం సాగించవచ్చు అన్నాడు ప్రసాదు.

మన పూర్తి కథతో కలువరాజు కలువ చెలిని కలుసుకోటానికి బయలుదేరాడు. మేంకూడ మా కోసం కనిపెట్టుకుని కూర్చున్న మా చెలులకడకు బయలుదేరాం. అందరూకలిసి యింటిముఖంపట్టారు.

మెదడును చల్లబరచి,
శిరోజములను నల్లబరచి,
కుదుళ్లను పదిలము చేయునది

కేసరిగారి

భృంగామలక తైలము

వెల రు. 2-0-0

వాడి చూడండి.

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

రాయపేట, మద్రాసు 14.